సాక్షి
నిర్మల్
ఆదివారం । 2 । జూలై । 2023

గరిష్టం/కనిష్టం
34.2 /26.3
వాతావరణం
ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. సాయంత్రం చినుకులు పడే అవకాశం ఉంది.

పర్యాటకం పరిఢవిల్లేనా..!

- శ్యాంగఢ్, సోన్‌బ్రిడ్జి అభివృద్ధికి ప్రతిపాదన
- నాలుగేళ్ల క్రితమే ప్రణాళిక రూపకల్పన
- ఇప్పటికీ ముందుకు పడని ఫైనం..
- తాజాగా దృష్టిపెడుతున్న కలెక్టర్

నిర్మల్: చూసేందుకు సమయం, చూడాలన్న ఆసక్తి ఉండాలే కానీ.. జిల్లాలో పర్యాటక అందాలెన్నో ఉన్నాయి. చారిత్రక కట్టడాలు ఇప్పటికీ నాటి చరిత్రను చెబుతాయి. దశాబ్దాలుగా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో కనుమరుగవుతున్నాయి. నిర్మల్ జిల్లాగా ఏర్పడిన తరువాత 2018 ఎన్నికల సభలో సీఎం కేసీఆర్ నిర్మల్ కేంద్రంగా టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఇప్పటికీ ఆ దిశగా అడుగులు పడటం లేదు.


సోన్ వద్ద గోదావరిపై గల పాత వంతెన

నాలుగేళ్ల క్రితం..

నాలుగేళ్ల క్రితం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సూచనతో అప్పటి కలెక్టర్ ప్రశాంతి పలు ప్రాంతాల పర్యాటకాభివృద్ధికి ప్రణాళిక రూ పొందించారు. ప్రతిపాదనలనూ సిద్ధం చేశారు. ఆ తర్వాత ఆమె బదిలీ కావడంతో ఆ ఫైళ్లు అటకెక్కాయి. గత కలెక్టర్ ముషరఫ్అలీ మొదట్లో కొంత పట్టించుకున్నా.. ఆ తర్వాత చేతులెత్తేశారన్న విమర్శలు వచ్చాయి. తాజాగా కలెక్టర్ వరుణ్‌రెడ్డి అలాంటి ప్రాంతాలను అభివృద్ధి చేసే దిశగా ఆలోచనలు చేస్తున్నారు. ఐటీడీఏ పీవోగానూ ఉన్న ఆయన ఉట్నూర్‌లోని పురాతన కట్టడాల అభివృద్ధి పనులు ప్రారంభించారు. దీంతో జిల్లావాసుల్లోనూ పర్యాటకంపై ఆశలు చిగురిస్తున్నాయి.


శిథిలమవుతున్న శ్యాంగఢ్ లోపలి భాగం

రాతి వంతెనను..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ముఖద్వారంగా సోన్ మండల కేంద్రంలో గోదావరి నదిపై గల పాత వంతెన పర్యాటక ప్రదేశంగా ఉపయోగపడుతుంది. ఈ వంతెనను 1932లో కేవలం రూ.9.50 లక్షలతో నిర్మించారు. అప్పటి నుంచి దశాబ్దం క్రితం వరకు నిర్విరామంగా సేవలు అందించింది. ఏళ్ల కిందట రాతి, డంగుసున్నంతో నిర్మించిన ఈ కట్టడం ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. దీనిపై నుంచి గోదావరి అందాలతోపాటు పచ్చని ప్రకృతిని వీక్షించవచ్చు. ఈ బ్రిడ్జినే పర్యాటకంగా ఉపయోగించుకునేందుకు కలెక్టర్ ప్రశాంతి హయాంలో ప్రతిపాదన చేశారు. వంతెనను శుభ్రం చేయడంతోపాటు రంగులు, లైటింగ్, సందర్శకులు కూర్చునేందుకు బెంచీలను ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. వంతెన దిగువన గోదావరిలో బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులకు చెప్పారు. కానీ అందులో ఏ ఒక్కటీ అమలులోకి రాలేదు.

ఎన్నో ప్రదేశాలు..

కాస్త పట్టించుకోవాలే కానీ.. పర్యాటకంగా ఎదిగేందుకు ఎన్నో ప్రదేశాలు ఎదురుచూస్తున్నాయి. నిర్మల్‌లోనే బత్తీస్‌గఢ్, ఖిల్లాగుట్ట, బంగల్ చెరువు ప్రాంతాలతోపాటు సోన్‌గఢ్, కదిలి, సదర్‌మాట్, బాసర తదితర ప్రాంతాల్లోనూ పర్యాటకాభివృద్ధికి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి. జిల్లాకేంద్రం మధ్యలోనూ ఖిల్లా, ఇటుకలతో నిర్మించిన కర్మాగారాలు, సరద్‌మహల్.. ఇలా పాడుబడి పోతున్న వాటిని కాసింత బాగు చేయించినా ముందుతరాలకు చరిత్ర తెలుసుకోవడంతోపాటు పర్యాటకంగానూ ఆకట్టుకుంటాయి. పదికిపైగా ఉన్న గొలుసుకట్టు చెరువులు ఎప్పుడూ జలకళతో ఉంటాయి. కనీసం వాటిల్లో బోటింగ్ పెట్టినా కుటుంబాలు ఆహ్లాదంగా గడిపే అవకాశం ఉంటుంది. తాజాగా కలెక్టర్ వరుణ్‌రెడ్డి నిర్మల్‌లోని పర్యాటక ప్రదేశాల అభివృద్ధి కోసం ఆరా తీస్తుండటం, ఇప్పటికే ఉట్నూర్‌లో పురాతన మెట్లబావి పనులు ప్రారంభించడంతో పర్యాటకాభివృద్ధిపై కొత్త ఆశలు రేకెత్తిస్తోంది.

గోల్కొండను తలపించే శ్యాంగఢ్.

నిమ్మనాయుడు, వెంకట్రాయుడు, శ్రీనివాసరావు తదితర పాలకుల హయాంలో ఎన్నో చారిత్రక గఢ్‌లు జిల్లా కేంద్రంలో నిర్మితమయ్యాయి. ఇప్పటికీ ఇవన్నీ నాటి ఠీవీని ప్రదర్శిస్తున్నాయి. ఇందులో నిర్మల్‌లోకి ప్రవేశించే మార్గంలో ఉన్న శ్యాంగఢ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇది గోల్కొండ కోట తరహాలో ఆకట్టుకుంటుంది. గతంలో ఇక్కడ టూరిజం శాఖ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులను చేపట్టినా ఏ మూలకూ సరిపోలేదు. నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఈ గఢ్‌ను బల్దియా నిధులతోనే అభివృద్ధి చేయాలని కలెక్టర్ ప్రశాంతి అప్పట్లో ఆదేశించారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) నిధుల నుంచి రూ.కోటిని శ్యాంగఢ్‌లో పర్యాటకాభివృద్ధికి కేటాయించాలని ఆమె చెప్పారు. ఆమె స్వయంగా అప్పటి మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్, కమిషనర్, అధికారులను వెంటబెట్టుకుని శ్యాంగఢ్‌ను పరిశీలించారు. అక్కడ చేయాల్సిన పనులనూ చెప్పారు. పిల్లలు ఆడుకునేలా పార్క్, పచ్చని చెట్లు, కూర్చుని సేద దీరేందుకు బెంచీలు, ఫౌంటెన్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే మున్సిపాలిటీకి వెళ్లి సంబంధిత నమూనా మ్యాప్‌లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అప్పట్లో కలెక్టరే చొరవ తీసుకోవడంతో ఇక శ్యాంగఢ్ మరో గోల్కొండ అవుతుందని అంతా భావించారు. కానీ ఆమె బదిలీ తర్వాత ముషరఫ్అలీ హయాంలో కేవలం రాత్రి పూట లైటింగ్‌కే పరిమితమైంది.


2019లో శ్యాంగఢ్‌ను పరిశీలిస్తున్న అప్పటి కలెక్టర్

పరిశీలిస్తున్నాం..

జిల్లాలోనూ చారిత్రక ప్రాంతాల పరిరక్షణతోపాటు పలు ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసే దిశగా పరిశీలిస్తున్నాం. సంబంధిత ప్రతిపాదనలు పరిశీలించి తగు చర్యలు చేపడతాం.

– వరుణ్‌రెడ్డి, కలెక్టర్

న్యూస్‌రీల్

బాసరలో గురుపౌర్ణమి ఉత్సవాలు


ఉత్సవాల్లో పాల్గొన్న అర్చకులు, అధికారులు

భైంసా: బాసరలో గురుపౌర్ణమి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. సరస్వతీ అమ్మవారికి పూజలు చేసిన అనంతరం వ్యాస పూజతో ఉత్సవాలు ప్రారంభించారు. మూడురోజులు జరిగే వేడుకల్లో భాగంగా మొదటిరోజు శాంతి పాఠము, దీక్ష సంకల్పం, విఘ్నేశ్వరపూజ, స్వస్తి పుణ్యాహ వచనం, రుత్విక్ భరణం, యాగశాల ప్రవేశం, మంటపారాధన, కలశస్థాపన, దేవతాస్థాపన, నవచండీ వేదపారాయణంతోపాటు పలు పూజలుచేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక వంశీయులు శరత్‌పాఠక్, ఏఈఓ విజయరామారావు, భక్తులు పాల్గొన్నారు.

అందుబాటులోకి రేడియాలజీ హబ్

- వర్చువల్‌గా ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు

నిర్మల్‌చైన్‌గేట్: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. టీ–డయాగ్నస్టిక్స్ సేవలు విస్తరణకు నిర్మల్ జిల్లా ఆసుపత్రి వేదికగా శాసనమండలి చీఫ్‌విప్ టి.భాను ప్రసాదరావు, టీఎస్ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతమోహంతి, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌తో కలిసి శనివారం వర్చువల్ మోడ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాథాలజీ, రేడియాలజీ హబ్‌లను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వ దవాఖానాల్లో అన్నిరకాల వైద్య సేవలు, రోగ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ వైద్యులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా డాక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ డాక్టర్లు అద్భుతంగా పనిచేస్తున్నారని ప్రజలు ఎక్కువగా ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చేలా ప్రజాప్రతినిధులు కూడా పని చేయాలన్నారు. ప్రభుత్వ దవాఖానకు చికిత్స కోసం వచ్చే రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం డయాగ్నస్టిక్ హబ్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు డయాగ్నోస్టిక్ హబ్ ద్వారా 134 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గతంలో 57 రకాల పరీక్షలు ఉచితంగా అందించామని, శనివారం నుంచి అదనంగా అనీమియా, యాంటి బ్యాక్టీరియల్ టెస్ట్, హార్మోనల్ టెస్ట్, క్యాన్సర్ పరీక్షలు, తలసేమియా, ఇమ్యూనో హిస్టోకెమిస్ట్రీ, హెచ్ఐవీ టెస్ట్, వైరల్‌లోడ్ టెస్ట్‌తోపాటు 77 పరీక్షలు అదనంగా చేయనున్నట్లు వివరించారు. ప్రైవేట్ ఆసుపత్రిలో రూ.వెయ్యి నుంచి రూ.10 వేల వరకు ఖర్చయ్యే పరీక్షలను ప్రభుత్వం పూర్తి ఉచితంగా డయాగ్నస్టిక్ హబ్ ద్వారా అందిస్తుందన్నారు. డయాగ్నస్టిక్ హబ్ ద్వారా 24 గంటల్లో రోగుల సెల్‌ఫోన్‌కు పరీక్ష ఫలితాలు అందిస్తామని తెలిపారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, బస్తీ దవఖానాకు డయాగ్నస్టిక్ హబ్‌ను మ్యాప్ చేయడం జరిగిందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్తీ దవాఖానాలలో నిర్వహించే పరీక్ష నమూనాలు జిల్లా కేంద్రంలో డయాగ్నోస్టిక్ హబ్‌కు తరలించేందుకు వాహనాలు ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించి, ప్రజలు ఈ సేవలు వినియోగించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, సూపరింటిండెంట్ దేవేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.


కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, వైద్యాధికారులు

ఖైదీలే.. కర్షకులై..

వారంతా ఖైదీలు.. వేర్వేరు కేసుల్లో శిక్ష అనుభవిస్తున్నారు.. క్షణికావేశంలో నేరం చేసినవారు కొందరైతే.. చెడు సహవాసం, పగలు, ప్రతీకారంతో తప్పు చేసి వచ్చినవారు ఇంకొందరు. ఇలాంటి వారిని సైతం సన్మార్గంలో నడిచేలా తీర్చిదిద్దుతున్నారు ఆదిలాబాద్ జిల్లా జైలు అధికారులు. ఖైదీలకు మంచిని వివరిస్తూ.. కారాగారాన్ని పూర్తిస్థాయిలో సత్ప్రవర్తన కేంద్రంగా మార్చేశారు. శిక్ష అనంతరం వారి కాళ్లపై వారు నిలబడేలా తీర్చిదిద్దుతున్నారు. కష్టించేతత్వాన్ని అలవరుస్తూ సాగులో రాణించేలా ప్రోత్సహిస్తున్నారు. కర్షకులుగా మార్చి వారికి బతుకుబాట చూపుతున్నారు. జైలులో ఉన్న ఖాళీ స్థలాన్ని వ్యవసాయ క్షేత్రంగా మలిచి సేంద్రియ సాగుకు శ్రీకారం చుట్టారు. దిగుబడిని జైలు అవసరాలకు ఉపయోగించడంతోపాటు మార్కెట్‌లో సైతం వాటి విక్రయాలు చేపడుతున్నారు. తాజాగా నాటుకోళ్ల పెంపకానికి శ్రీకారం చుట్టారు. కఠిన హృదయాలను సైతం కరిగించి.. వారికి జీవితం విలువ తెలిసేలా చొరవ చూపుతున్న ఆదిలాబాద్ జిల్లా జైలుపై ప్రత్యేక కథనం.

– కైలాస్‌నగర్/ఆదిలాబాద్‌టౌన్


నర్సరీ పనుల్లో నిమగ్నమైన ఖైదీలు

- వ్యవసాయ క్షేత్రంగా జిల్లా జైలు
- సేంద్రియ విధానంలో పంటల సాగు
- నాటుకోళ్ల పెంపకం, విక్రయాలు సైతం
- సత్ప్రవర్తన కేంద్రంగా మార్చిన అధికారులు

రకరకాల పండ్ల మొక్కలు

జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్‌నగర్‌లో గల జిల్లా జైలు 28 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. ఇందులో పదెకరాల్లో జైలు, అధికారులు, సిబ్బంది నివాస గృహాలతో కూడిన భవన సముదాయం ఉంది. మిగతా సుమారు 18 ఎకరాలు ఖాళీగా ఉండటాన్ని గుర్తించిన అధికారులు దాన్ని వ్యవసాయ క్షేత్రంగా మార్చారు. ఆరు ఎకరాల్లో వివిధ రకాల పంటలు పండిస్తున్నారు. ఇందులో రెండు ఎకరాల్లో టేకు, మరో ఎకరంలో దానిమ్మ, సీతాఫల్, రామఫల్, లక్ష్మణ్‌ఫల్, బేర్ ఆపిల్, అంజీర్, జామ పండ్ల మొక్కలు నాటారు. అవి వృక్షాలుగా ఎదిగి ఫలసాయం అందిస్తున్నాయి. మిగతా స్థలంలో డ్రాగన్‌ఫ్రూట్, బొప్పాయి తోట ఏర్పాటు చేశారు. వీటికి పైపులైన్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. ఎలాంటి రసాయనిక ఎరువుల జోలికి వెళ్లకుండా పూర్తి సేంద్రియ విధానంలోనే సాగు చేస్తున్నారు. జైలులో పోగయ్యే చెత్తాచెదారం, చెట్ల నుంచి రాలిన ఆకులు, పశువుల పేడనే ఎరువుగా మార్చుతున్నారు. అలాగే చేపలు, నాటుకోళ్ల పెంపకం సైతం చేపడుతున్నారు.

కూరగాయలు సైతం..

మరో ఎనిమిది ఎకరాల్లో టమాట, వంకాయ, సోర, చిక్కుడు, అలచంద, బీర, బెండ, మునగ వంటి కూరగాయల సాగు చేస్తున్నారు. అలాగే అంతర పంటగా పాలకూర, మెంతి, తోటకూర, గోంగూర, బచ్చలికూరతో పాటు తృణధాన్యాలైన రాగులు, కొర్రలు, సాములను సైతం సాగు చేస్తుండడం గమనార్హం. పూల సాగుకు మరో మరో ఎకరం వరకు కేటాయించారు. గతేడాది అర ఎకరంలో ప్రత్యేకంగా చేపల చెరువు సైతం ఏర్పాటు చేసి వేలాది చేప పిల్లలను వేశారు. వేసవిలో అది ఎండిపోయింది. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురిస్తే మళ్లీ చేపలు పెంచేందుకు సన్నద్ధమవుతున్నారు.


జైలులో పెంచుతున్న నాటు కోళ్లు

నాటు కోళ్ల పెంపకం, విక్రయాలు

జైళ్ల శాఖ వరంగల్ డీఐజీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు నాటుకోళ్ల పెంపకానికి శ్రీకారం చుట్టారు. మొదటి బ్యాచ్‌లో 250 కోళ్లను తీసుకువచ్చి ఆరు నెలలుగా పెంచుతున్నారు. వీటి కోసం అర ఎకరం స్థలంలో ప్రత్యేక షెడ్‌తో పాటు మునగ తోట ఏర్పాటు చేశారు. ఇక్కడ పండించే ఆకు కూరలతో పాటు రాగులు, కొర్రలు, సాములు, జొన్నలు అందిస్తూ పెంచుతున్నారు. కోళ్లు పెరగడంతో రెండు రోజుల క్రితం విక్రయాలు సైతం ప్రారంభించారు. కిలోకు రూ.350 చొప్పున జైలు వద్దే విక్రయిస్తున్నారు.

150 మంది ఖైదీలతో..

ఇక్కడ శిక్ష అనుభవిస్తున్న 150 మంది ఖైదీల ద్వారా ఈ సాగు చేపడుతున్నారు. దిగుబడిని జైలు అవసరాలకు వినియోగించడంతో పాటు రైతు బజార్‌లోనూ విక్రయిస్తున్నారు. ఈ విధానం ద్వారా ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకురావడంతో పాటు వారు మానసికంగా ఉండేందుకు దోహదపడుతుందని జైలు అధికారులు చెబుతున్నారు.

ప్రజల్లో మంచి డిమాండ్ ఉంది



జైలులో పండించే కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో పాటు నాటు కోళ్లకు ప్రజల్లో మంచి డిమాండ్ ఉంది. సేంద్రియ విధానంలోనే పండించే వాటిని ప్రజలు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. నాటుకోళ్లను రూ.350 కిలో చొప్పున విక్రయిస్తున్నాం. వాటికి రశీదులు సైతం అందజేస్తున్నాం. జైలు శిక్ష పడ్డ ఖైదీల్లో మార్పు తీసుకురావడంతో పాటు వారు బయటకు వెళ్లాక తామ కాళ్లపై తాము నిలబడేలా ప్రత్యేక శిక్షణనిస్తూ ఉపాధి కల్పిస్తున్నాం. వ్యవసాయ క్షేత్రంలో పనిచేసే ఖైదీలకు రోజుకు రూ.70 ఇస్తుండగా.. ఇతర పనులు చేసే వారికి రూ.50, రూ.30 చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నాం. వారు బయటకు వెళ్లే సమయంలో పాస్‌బుక్ అందజేస్తాం. బీపీసీఎల్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ సైతం ఏర్పాటు చేస్తున్నాం. త్వరలోనే అది ప్రారంభమవుతుంది.

– పి.అశోక్‌కుమార్, జిల్లా జైలు సూపరింటెండెంట్, ఆదిలాబాద్

ఆహా.. బిర్యానీ

- ఆస్వాదిస్తున్న భోజన ప్రియులు
- అందుబాటులో విభిన్న రుచులు
- వెలుస్తున్న ప్రత్యేక సెంటర్లు
- నేడు ప్రపంచ బిర్యానీ దినోత్సవం..





బిర్యానీ.. ఈ పేరు వినగానే నోట్లో నీళ్లూరుతాయి. బిర్యానీ అంటే ఇష్టపడని వారు ఉండరు అంటే అతిశయోక్తి కాదు. చికెన్, మటన్, రొయ్యలు వెజ్, ఆలు, పన్నీర్ తదితర బిర్యానీలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఒకప్పుడు సంపన్నులు మాత్రమే తింటారనుకునే బిర్యానీ ఇప్పుడు అందరి ఇళ్లకు చేరింది. తెలంగాణకు ప్రత్యేకతను సంతరించి పెట్టిన హైదరాబాదీ బిర్యానీ ప్రస్తుతం నిర్మల్ ప్రాంతవాసులకు కూడా రుచి చూపిస్తోంది. జిల్లా కేంద్రంలో పలు బిర్యానీ కేంద్రాలతోపాటు రెస్టారెంట్లలో సైతం విభిన్న రకాల రుచులతో బిర్యానీలు అందుబాటులోకి వచ్చేశాయి. జూలై 2(తొలి ఆదివారం) ప్రపంచ బిర్యానీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

– నిర్మల్‌ఖిల్లా

ఉరుకులు.. పరుగుల జీవితంలో విద్యార్థులు, యువత, ఉద్యోగులు, వ్యాపారులు హోటల్ భోజనంపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. చాలా మంది భిన్నమైన రుచుల కోసం ఏదో ఒక సమయంలో బయటి ఆహారం తింటున్నారు. ఇలా నాలుక జిహ్వ తీర్చాలనుకునేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఒకప్పుడు బాగా డబ్బున్నవాళ్లు మాత్రమే బిర్యానీ తింటారని భావించేవారు. కానీ అందరికీ అందుబాటులో ఉండేలా బిర్యానీ పాయింట్, రెస్టారెంట్ల నిర్వాహకులు భోజన ప్రియులు కోరుకున్న రుచుల్లో బిర్యానీ వండి వడ్డిస్తున్నారు. దీంతో వీకెండ్స్‌లో బిర్యానీ కోసం బయటకు వెళ్లే ఫ్యామిలీల సంఖ్య పెరుగుతోంది.

యూత్‌లో క్రేజ్..

ఇక యువతలో బిర్యానీ క్రేజ్ పెరుగుతోంది. వేడుక ఏదైనా రెస్టారెంట్లు, బిర్యానీ పాయింట్లకు వెళ్లి భోజనం చేస్తున్నారు. ఏ ఇద్దరు ఫ్రెండ్స్ కలిసినా చలో బిర్యానీ లాగించేద్దాం అంటూ వెళ్తున్నారు. ఇక ఇంటికి బంధువులు వస్తే.. ఇంట్లో బిర్యానీ చేయడానికి ఇబ్బంది పడేవారు.. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే ఇంటికే బిర్యానీ వస్తోంది. చాలా ఫ్యామిలీలు వీకెండ్‌లో ఆహ్లాదం కోసం సినిమాలు, షికారుకు వెళ్లి వచ్చేటప్పుడు రెస్టారెంట్, బిర్యానీ పాయింట్లకు వెళ్లడం కామన్‌గా మారింది.



పెళ్లిళ్లలో ప్రత్యేక వంటకం..

ఇక పెళ్లిళ్లలో బగారాతో భోజనం పెట్టేవారు.. ప్రస్తుతం బిర్యానీ వంటకం ప్రత్యేకంగా మారుతోంది. పెళ్లి కోసం భారీగా ఖర్చు చేస్తున్నవారు.. మటన్, చికెన్, ఫిష్, ప్రాన్స్ తదితర వెరైటీ బిర్యానీలు ప్రత్యేకంగా తయారు చేయిస్తున్నారు.

జిల్లా కేంద్రంలో ప్రత్యేక సెంటర్లు..

భిన్న సంస్కృతి, విభిన్న సంప్రదాయాలు, కొత్త కొత్త అభిరుచులకు తగ్గట్టుగా ప్రస్తుతం నిర్మల్ జిల్లాకేంద్రంలో పలు హోటల్స్, రెస్టారెంట్స్‌ల్లో బిర్యానీలు అంటుబాటులో ఉన్నాయి.

- అరబ్ దేశాల్లో ఉండే మండీ బిర్యానీ నిర్మల్‌లో అందుబాటులో ఉంది. ఒక్క పెద్ద ప్లేట్‌లో నలుగురు కూర్చొని తినవచ్చు. జిల్లా కేంద్రంలో ఇలాంటి మండీ బిర్యానీ సెంటర్లు ఏడెనిమిది ఉన్నాయి.
- ఫ్రైడ్ చేసిన చికెన్‌తో బిర్యానీ.. రుచిగా, మంచి వాసనతో ఆహార ప్రియులను ఈ వంటకం ఆకట్టుకుంటుంది.
- జాయింట్ లెగ్ పీస్ బిర్యానీ.. కాస్త డిఫరెంట్ రుచి కోరుకునేవారికి జాయింట్ లెగ్ పీస్ బిర్యానీ బాగా నచ్చుతుంది. ఈ మధ్య కాలంలో చాలా మంది ఈ బిర్యానీని ఇష్టపడుతున్నారు.
- ఇళ్లలో తయారీ.. ఇక బయటి ఫుడ్ ఎందుకు అనుకునేవారు బిర్యానీ తినడం మానడం లేదు.. యూట్యూబ్, పత్రికల్లో వచ్చే వంటకాలను చూసి ఇంట్లోనే తయారు చేసుకుని ఆరగిస్తున్నారు.

ఆర్డర్ చేస్తే ఉన్నచోటికే..

ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే తమకు కావాల్సిన బిర్యానీ ఇంటికి వచ్చేస్తుంది. దీంతో 'నో కుకింగ్ డే'లుగా కుటుంబ సభ్యులు సైతం అందరూ కలిసి ఇంటికి తెచ్చి ఇచ్చే ఆర్డర్లలో ఎక్కువగా బిర్యానీలకే ప్రాధాన్యతనిస్తున్నారని హోటల్ యాజమానులు పేర్కొంటున్నారు.



రోజు 300 మంది కస్టమర్లు..



ప్రతిరోజు మా కేంద్రానికి దాదాపు 300 మంది కస్టమర్లు వస్తారు. వారికి రుచికరమైన బిర్యానీలను వారు కోరుకున్న విధంగా తయారుచేసి అందిస్తున్నాం. చికెన్, మటన్, రొయ్యలు తదితర ప్రత్యేక వంటకాలతో బిర్యానీలను కస్టమర్లకు అందిస్తున్నాం. ఇక వీకెండ్ రోజుల్లో కస్టమర్ల తాకిడి ఎక్కువగా ఉంటుంది.

– లోలం వెంకటేష్, బిర్యానీ సెంటర్ ఫ్రాంచైజీ నిర్వాహకుడు

బిర్యానీ రుచులను ఆస్వాదిస్తున్నాం...



నిర్మల్ పట్టణంలో పలురకాల బ్రాండ్లతో కూడిన విభిన్న రుచుల బిర్యానీ సెంటర్లు అందుబాటులో వచ్చాయి. మేము ప్రతీ ఆదివారం మా మిత్రులతో కలిసి బిర్యానీ రుచులను ఆస్వాదిస్తున్నాం. మా ఫ్రెండ్స్‌తో పాటు పుట్టిన రోజు, ఏ చిన్న ట్రీట్ అయిన బిర్యానీకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నాం.

– రవి, వినియోగదారుడు, నిర్మల్

ప్రశాంతంగా గ్రూప్ -4 పరీక్ష


హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న అభ్యర్థులు


ఉచిత సౌకర్యాన్ని వినియోగించుకున్న అభ్యర్థులు

నిర్మల్ రూరల్: గ్రూప్–4 ఉద్యోగాల భర్తీకి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ శనివారం నిర్వహించిన పరీక్షలు జిల్లాలో శనివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో 54 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా మొత్తం 15,474 అభ్యర్థులకు ఉదయం 13,135 మంది(84.88 శాతం) అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. మధ్యాహ్నం 13,093 మంది (84.61 శాతం) మంది పరీక్ష రాశారు. అభ్యర్థులను గంట ముందుగానే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. 15 నిమిషాల ముందే గేట్లు మూసివేయడంతో ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు నిరాశగా వెనుదిరిగారు. సోఫీనగర్‌లోని జ్యోతిబాపూలే పరీక్ష కేంద్రానికి ఓ మహిళా అభ్యర్థి ఆలస్యంగా రాగా, దీక్ష జూనియర్ కళాశాలలో ముగ్గురు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో పరీక్షా కేంద్రానికి అనుమతించలేదు. ఉదయం, సాయంత్రం పరీక్ష అనంతరం అభ్యర్థుల నుంచి బయోమెట్రిక్ హాజరు తీసుకున్నారు. పోలీసుల ఆధ్వర్యంలో బస్టాండ్, మంచిర్యాల్ చౌరస్తా వద్ద గ్రూప్–4 అభ్యర్థుల కోసం హెల్ప్ సెంటర్లు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

ట్రిపుల్‌ఐటీ అధ్యాపకుడికి డాక్టరేట్


అధ్యాపకుడిని అభినందిస్తున్న వీసీ

భైంసా(ముధోల్): బాసర ట్రిపుల్‌ఐటీలో మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న అధ్యాపకుడు కుమార్ రాగులకు కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. న్యూమారికల్ మెథడ్స్‌ఫర్ ఎ క్లాస్ ఆఫ్ సింగులర్లీ పట్టర్బుడ్ డిఫరెన్షియల్ డిఫరెన్స్ ఈక్వేషన్స్ అనే అంశంపై కేయూ మ్యాథమెటిక్స్ విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ జీబీఎస్ఎల్ సౌజన్య పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేశారు. డాక్టరేట్ పొందిన కుమార్‌రాగులను ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వీసీ, అధ్యాపకులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్సియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అబ్జెక్టివ్ టైపు, అప్టిట్యూడ్ పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించరాదన్నారు. study circle. cgg. gov. in ఆన్‌లైన్‌లో ఈ నెల 8 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు గిరిజన సంక్షేమ ఉపసంచాలక కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి

ఆదిలాబాద్‌రూరల్: చించుఘాట్ గ్రామ పంచాయతీ పరిధిలోని జెండాగూడ గ్రామానికి చెందిన పెందూర్ మాధవ్‌రావు (47) శనివారం విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం మాధవ్‌రావు ఇంటిపై కప్పు (రేకులు) సరిచేస్తుండగా రేకులకు విద్యుత్ సరఫరా కావడంతో కిందపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం అందించారు. చికిత్స కోసం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య శారద, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీకి చెందిన భూమన్న (45) అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు.


భూమన్న

ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న భూమన్న గత నెల 29న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. శనివారం అతని భార్య స్వరూపరాణి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నైపుణ్య పాఠం..

భవితకు ఊతం

- కేజీబీవీల్లో ప్రత్యేక తరగతులు
- విద్యార్థినుల శక్తి సామర్థ్యాల పెంపునకు ప్రణాళిక


జీవన నైపుణ్యాలపై రూపొందించిన పుస్తకాలను కేజీబీవీ విద్యార్థినులకు అందజేస్తున్న ప్రత్యేకాధికారి అజ్మీర రజిత

నేరడిగొండ(బోథ్): చక్కని ప్రణాళికతో ఉత్తమ నైతిక విలువలను పెంపొందించుకుంటూ సమున్నతంగా జీవించేందుకు అవసరమైన నిరంతర ప్రక్రియే జీవన నైపుణ్యం. ప్రధానంగా కౌమారదశలో విద్యార్థినులను శారీరక, మానసిక భావోద్వేగాలు చుట్టుముడుతాయి. సమాజ స్థితిగతులపై అవగాహన ఏర్పర్చుకుంటూ మానసికంగా ఎదిగేందుకు అవసరమైన సామర్థ్యం పెంచుకోవడం విద్యార్థి దశలో ఎంతో అవసరం. జీవన నైపుణ్యాలు నేర్పితే వారి భవితకు బంగారుబాట వేసినట్లవుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం జీవన గమనంలో ఎదురయ్యే ఆటుపోట్లను అధిగమిస్తూ ఒత్తిళ్లను తట్టుకునేందుకు కస్తూరిబాగాంధీ బాలికల గురుకుల విద్యాలయాల్లో (కేజీబీవీ) ప్రత్యేక బోధనకు శ్రీకారం చుట్టింది. వీటికి సంబంధించిన 'జీవన నైపుణ్యాల విద్య' పుస్తకాలు ఇప్పటికే విద్యాసంస్థలకు చేరాయి. ఉమ్మడి జిల్లాలో కేజీబీవీలు 68 ఉండగా 8,160 మంది విద్యార్థినిలు 6,7,8 తరగతుల్లో విద్యను అభ్యసిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా కేజీబీవీల వివరాలు

జిల్లా	కేజీబీవీలు	విద్యార్థినుల సంఖ్య
ఆదిలాబాద్	17	2,040
నిర్మల్	18	2,160
కుమురంభీం	15	1,800
మంచిర్యాల	18	2,160

వేధింపులపై అప్రమత్తం..

చాలా మంది బాలికలు లైంగిక, ఇతర వేధింపులతో పాటు హింసను ఎదుర్కొంటున్నారు. లైంగిక హింస అంటే ఏమిటి? దాడులు ఎలా జరుగుతున్నాయి? వీటి బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? పరిచయం లేని వారితో ఎలా ఉండాలి? తదితర అంశాలను వివరిస్తారు.

6,7,8 తరగతులకు..

మొదట ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా 6, 7, 8 తరగతుల విద్యార్థినులకు అమలు చేస్తున్నారు. భవిష్యత్ పరిణామాలు అంచనా వేయడం, సహచర విద్యార్థినులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులతో అనుబంధాలపై బోధన ఉంటుంది. సాధారణంగా కేజీబీవీల్లో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థినులే ఎక్కువగా చదువుతుంటారు. విద్యార్థినులు భవిష్యత్‌లో ఆసక్తి ఉన్న రంగంలో ఆర్థికంగా నిలదొక్కుకుని నైపుణ్యాలు పెంపొందించుకునేలా తరగతులు బోధించనున్నారు.

బోధించే అంశాలివే..

- విద్యార్థినులు తమను తాము విశ్వసించుకునేలా వారిలోని బలాలు, బలహీనతలను తెలియజేయడం, భయాలు, అవకాశాలు, లక్ష్యాలు గుర్తించేలా చేయడం.
- ఇతరుల పాత్రలోకి ప్రవేశించి ఆలోచించే నైపుణ్యం, కోపం, విచారం, ఉద్వేగాలను ఎలా అర్థం చేసుకోవాలి? ఎలా నియంత్రించాలి? ఎదుటి వారితో సంయమనంతో ప్రవర్తించే పద్ధతులు తెలియజేయడం.
- సహచరుల ఒత్తిడి, భావోద్వేగాలను అర్థం చేసుకోవడం, వాటిని నియంత్రించే విధానాలను అవలంభించేలా తీర్చిదిద్దడం.
- నిత్యం ఎదురయ్యే సవాళ్లు, సమస్యలకు గల కారణాలను గుర్తించడం, ప్రత్యామ్నాయ విధానాలతో పరిష్కరించడం.
- ఏదైనా సమాచారం, పరిస్థితి, సమస్యను పలు కోణాల్లో విశ్లేషించి క్షుణ్నంగా అర్థం చేసుకుని పరిష్కరించే సామర్థ్యాలు పెంపొందించడం.
- భవిష్యత్ పరిణామాలను గుర్తించి సరైన అంశాన్ని ఎంచుకుని నిర్ణయం తీసుకునే శక్తిసామర్థ్యాలు అలవర్చడం.
- సమాజం పట్ల జీవన సానుకూల దృక్పదాన్ని అలవర్చడం, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయుల ప్రాధాన్యాన్ని వివరిస్తూ వారితో గౌరవ భావంతో ఉండేలా బోధించడం.
- సమస్యలను సృజనాత్మకంగా పరిష్కరించే విభిన్న కోణాలు తెలియజేయడం.
- ఇతరులతో మాట్లాడే విధానం, ఇతరులు చెప్పే మాటలు వినగల సామర్థ్యాలు పెంపొందించడం

వారానికి మూడు తరగతులు

నూతన విద్యాసంవత్సరంలో కేజీబీవీల్లో వారానికి మూడు తరగతులు నైపుణ్య పాఠాలు బోధించేలా ప్రణాళికలు రూపొందించారు. విద్యాలయాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న బోధకులతోనే ఈ తరగతులు నిర్వహిస్తారు. సమగ్రశిక్షా అధికారులు ఇందుకు సంబంధించిన ప్రత్యేక పుస్తకాలను కూడా కేజీబీవీలకు చేర్చారు.

పరిపూర్ణ జీవనానికి దోహదం



విద్యార్థినుల్లో ప్రతికూల ధోరణులు, ప్రమాదకర ప్రవర్తనలను నివారిస్తూ ఉత్తమంగా తీర్చిదిద్దేలా బోధించాలన్న లక్ష్యంతో ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. సానుకూల వైఖరి, ఉన్నత విలువలు పెంపొందించేలా బోధనాంశాలు పొందుపర్చారు. వారి పరిపూర్ణ జీవనానికి ఇది దోహదం చేస్తుంది.

– ఉదయశ్రీ, జీసీడీవో, ఆదిలాబాద్

'కుంటాల'ను సందర్శించిన కుమురంభీం జిల్లా జడ్జి


కుంటాల జలపాతం వద్ద జిల్లా జడ్జి

నేరడిగొండ(బోథ్): కుమురంభీం జిల్లా జడ్జి ఎంవీ.రమేశ్ శనివారం మండలంలోని కుంటాల జలపాతాన్ని సతీసమేతంగా సందర్శించారు. జలపాతం, ప్రకృతి అందాలను తిలకించారు. పర్యాటకులకు కల్పించే సౌకర్యాల గురించి ఆరా తీశారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ జలపాతం పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పర్యాటకులకు ఇబ్బందులు కలగకుండా వారికి తగు సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై మారుతి, ఎఫ్ఎస్‌వో వసంత్ కుమార్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీలో సదస్సు


సదస్సులో పాల్గొన్న ఇన్‌చార్జి వీసీ

భైంసా(ముధోల్): పరిశోధన ప్రాజెక్టు ప్రతిపాదన తయారీపై శనివారం బాసర ట్రిపుల్‌ఐటీలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ మాట్లాడుతూ ప్రాజెక్టులు రాయాల్సి వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతులు, వాటిని అమలుచేసే విధానాన్ని వివరించారు. ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులు పీహెచ్‌డీలో చేరిన వారికి ఈ సదస్సు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపా రు. సీఎస్ఐఆర్ మాజీ సైంటిస్ట్ డాక్టర్ భానుప్రకాశ్ మాట్లాడుతూ ఉన్నత విద్యను పొందాలంటే ప్రాజెక్టులో భాగంగా పరిశోధన పత్రాన్ని రా యాల్సి ఉంటుందన్నారు. అకాడమిక్ ప్రోగ్రాం విధించిన బడ్జెట్ ఇతర పరిమితులకు పరిశోధ న ఎలా సరిపోతుందో వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ చంద్రశేఖర్, అసోసియేట్ డీన్ డాక్టర్ పావని, డాక్టర్ వినోద్, రిసెర్చ్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ కాశన్న, సభ్యులు డాక్టర్ సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన నరేశ్ జాదవ్


రేవంత్‌రెడ్డితో నరేష్ జాదవ్

గుడిహత్నూర్(బోథ్): ఏఐసీసీ సభ్యుడు నరేశ్ జాదవ్ శనివారం మాజీ మంత్రి రాంచంద్రారెడ్డితో కలిసి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశా రు. జిల్లాలో కాంగ్రెస్ గెలుపుపై రేవంత్‌రెడ్డితో చర్చించినట్లు నరేష్ జాదవ్ తెలిపారు. పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని రేవంత్‌రెడ్డి సూచించినట్లు ఆయన తెలిపారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రజలతో కలిసి సమస్యలపై ఉద్యమించాలని, కాంగ్రెస్ పాలనలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని, నియోజకవర్గాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించినట్లు ఆయన పేర్కొన్నారు. అపార అనుభవం కలిగిన సీ.రాంచంద్రారెడ్డి పార్టీ గెలుపుకు తగిన సలహాలు ఇవ్వాలని కోరినట్లు ఆయన తెలిపారు.

స్పెషల్ పార్టీ పేరుతో వైన్స్‌లో చోరీ

- కౌంటర్‌లోంచి రూ.లక్ష ఎత్తుకెళ్లిన దుండగులు

నార్నూర్: స్పెషల్ పార్టీ పోలీసులం.. హైదరాబాద్ నుంచి వచ్చామంటూ గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మండల కేంద్రంలోని వైన్స్ దుకాణంలో శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. రాత్రి 9:30 గంటలకు వైన్స్‌కు వచ్చిన ఇద్దరు వ్యక్తులు స్పెషల్ పార్టీ పోలీసులమని, హైదరాబాద్ నుంచి వచ్చామని చెప్పడంతో అందులో పనిచేస్తున్న జాదవ్ నరేష్ నిజమేనని నమ్మి..గిరాకీ ఉంది కూర్చోండి అంటూ కుర్చీలు ఇచ్చి పనిలో నిమగ్నమయ్యాడు. వైన్స్‌లో పనిచేసే మరో వ్యక్తి రాములు పనిమీద బయటికి వెళ్లడంతో ఇదే అదనుగా భావించిన సదరు వ్యక్తులు నిమిషం వ్యవధిలోనే కౌంటర్‌లోంచి దాదాపు రూ.లక్ష అపహరించి పరారయ్యారు. గమనించిన నరేష్ వెంటనే సీసీ కెమెరా పరిశీలించగా అందులో ఇద్దరు వ్యక్తులు డబ్బులు తీసుకున్నట్టు దృశ్యం రికార్డయింది. స్థానికులను అడుగగా ఇద్దరు వ్యక్తులు బ్లాక్ కారులో ఇప్పుడే స్పీడ్ గా వెళ్లారని తెలపడంతో వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై రవి కిరణ్ వెంటనే అప్రమత్తమై ఉట్నూర్, ఇంద్రవెల్లి ఎస్సైలకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో పంచాయతీ కార్మికుడు మృతి

- వీధి దీపాలు అమరుస్తుండగా ఘటన
- న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన


ప్రశాంత్ (ఫైల్)

బెల్లంపల్లిరూరల్: వీధి దీపాలు అమరుస్తుండగా విద్యుత్ స్తంభం పైనుంచి కిందపడి గ్రామ పంచాయతీ కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బెల్లంపల్లిరూరల్ సీఐ రాజేకుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి మండలం బుధాకుర్దు గ్రామానికి చెందిన రాచకొండ పోశం, యశోద దంపతుల కుమారుడు రాచకొండ ప్రశాంత్(26) బుధాకుర్దు గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా (గ్రామ పంచాయతీ కార్మికుడిగా) పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా శని వారం గ్రామంలోని ఓ వీధిలో దీపాలు అమర్చేందు కు విద్యుత్ శాఖ లైన్‌మెన్ సహకారంతో ఎల్‌సీ తీసుకున్నాడు. స్తంభం ఎక్కి వీధి దీపం అమరుస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో మూడు రోజుల్లో అతనికి పెళ్లి చూపులు ఉన్నట్లు సమాచారం.

ఇద్దరిని బలిగొన్న అతివేగం

- అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు
- ఇద్దరు దుర్మరణం.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లిలో ఘటన
- నిర్మల్ జిల్లా జామ్‌లో విషాదం


అబ్దుల్ సమీర్ మృతదేహం


అలీమొద్దీన్ మృతదేహం


అబ్దుల్ సమీర్(ఫైల్)


అలీమొద్దీన్(ఫైల్)

దంతాలపల్లి: అతివేగంతో వచ్చిన కారు అదుపుతప్పి రోడ్డుపై పల్టీలు కొడుతూ రోడ్డుపక్కన ఉన్న చెట్టు, విద్యుత్ స్తంభం మధ్యలో చిక్కుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున జరిగింది. మృతులు నిర్మల్ జిల్లావాసులు. స్థానికులు, ఎస్సై కూచిపూడి జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్‌కు చెందిన అన్వర్‌ఖాన్ ఖమ్మం జిల్లా మధిరలో హైడ్రాలిక్ క్రేన్ కొనుగోలు చేశాడు. దానిని తీసుకువచ్చేందుకు శుక్రవారం రాత్రి 10.30 గంటలకు నిర్మల్ నుంచి కారులో డ్రైవర్ అబ్దుల్ సమీర్(21), క్రేన్ డ్రైవర్ షేక్ అలీముద్దిన్(21), హెల్పర్ షేక్ రెహాన్‌తో కలిసి అన్వర్‌ఖాన్ బయలు దేరారు. శనివారం తెలవారుజామున దంతాలపల్లి మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ సమీపంలోకి రాగానే గేదె అడ్డు రావడం.. అప్పటికే కారు వేగం మీద ఉండడంతో అదుపుతప్పి రోడ్డుపై 20 మీటర్ల దూరం వరకు పల్టీలు కొట్టింది. ఆ తరువాత రోడ్డు పక్కన ఉన్న చెట్టు, విద్యుత్ స్తంభానికి మధ్యలో చిక్కుకుపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదంలో అలీముద్దిన్ అక్కడికక్కడే మృతి చెందగా కారుడ్రైవర్ అబ్దుల్ సమీర్ ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. అన్వర్‌ఖాన్, రెహాన్‌కు తీవ్రగాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు సమీర్ మామ మహ్మద్ పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. తొర్రూరు సీఐ సత్యనారాయణ ఈ ప్రమాదానికి గల కారణాలను విచారణ చేపట్టనునట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. ప్రమాద సమయంలో కారు అతివేగం మీద ఉందని, అందుకే కారు గాలిలో ఎగురుతూ పల్టీలు కొట్టినట్లు స్థానికులు తెలిపారు.

ఇరుకుటుంబాల్లో అంతులేని విషాదం

సారంగపూర్: అలీమొద్దీన్‌కు ఆరుగురు అక్కాచెల్లెల్లు. చిన్నతనంలోనే తండ్రి ఇమాముద్దీన్ మృతి చెందడంతో కుటుంబ భారం తల్లి రుక్సానా బేగంపై పడింది. బీడీలు చుడుతూ పిల్లలను పెంచి పెద్దచేసింది. పెద్దకుమార్తె రియానాను అన్వర్‌కు ఇచ్చి వివాహం చేసింది. అప్పటినుంచి తన బావమరిది అయిన అలీమొద్దీన్‌ను తనవద్దే క్రేన్ ఆపరేటింగ్ నేర్పించి పనిలో పెట్టుకున్నాడు. వచ్చే జీతంతో మరో ముగ్గురు నుజ్జుబేగం, రుబీనా, రేశ్మల వివాహం చేశాడు. ఇంటి భారం తానే మోస్తూ ఇంటికి పెద్దదిక్కుగా నిలిచాడు. ఇదే సమయంలో రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబలించడంతో ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది.

సమీర్‌ది నిరుపేద కుటుంబమే....

అబ్దుల్ సమీర్ తండ్రి వాహిద్ దివ్యాంగుడు. అటవీశాఖలో రోజువారీ కూలీ కింద వాచర్‌గా పనిచేస్తున్నాడు. తల్లి అంజుాబేగం బీడీలు చుడుతూ కుటుంబానికి బాసటగా నిలుస్తోంది. వీరికి సమీర్ ఏకైక సంతానం. రెండేళ్లుగా కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబానికి ఆసరగా నిలిచాడు. ఇదే సమయంలో అనుకోని రీతిలో కారు ప్రమాదం జరగడంతో తన ఒక్కగానొక్క కుమారుడి మృతిని ఆతల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు.

నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ధర్నా


జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

బేల: నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మండలకేంద్రంలోని జాతీయ రహదారిపై యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం రైతులతో కలిసి రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ప్రస్తుతం కేవలం 14 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నారన్నారు. లోవోల్టేజి సమస్య ఏర్పడి స్టాటర్లు, మోటార్లు కాలిపోతున్నాయన్నారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి ఏఈ వినోద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, జైనథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాంఖడే వామన్, ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు ఎండీ అఖిల్, నాయకులు గావుండే ఘణేశ్యాం, కాడే సంతోష్, బోయర్ శంకర్, మడావి చంద్రకాంత్, బొక్రే శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మకు పరీక్ష.. పాపాయికి నిరీక్షణ..!

భైంసాలో చిన్నారిని ఆడిస్తున్న అమ్మమ్మ



తల్లి పరీక్షకు హాజరుకాగా చిన్నారిని నిద్రపుచ్చుతున్న బామ్మ



చాణక్య కళాశాల ఆవరణ ఆరుబయట చిన్నారిని ఎత్తుకొని నిరీక్షిస్తున్న అమ్మమ్మ



దీక్ష జూనియర్ కళాశాల ఆవరణలో ...



భైంసాలో చిన్నారికి నీళ్లు తాగిస్తున్న తండ్రి



జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన గ్రూప్‌-4 పరీక్షకు జిల్లా నలుమూలల నుంచి అభ్యర్థులు పరీక్ష రాసేందుకు జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. తమ పిల్లలను పరీక్ష కేంద్రాలకు తీసుకువచ్చిన కొందరు మహిళా అభ్యర్థులు చిన్నారులను తండ్రి, అమ్మమ్మ, నానమ్మల వద్ద వదిలి పరీక్ష కేంద్రంలోనికి వెళ్లారు. ఎండకూడా కాస్త ఎక్కువగానే ఉండడంతో ఆరుబయట చెట్ల నీడలో పిల్లలను ఆడిస్తూ కనిపించిన దృశ్యాలను సాక్షి కెమెరాలో క్లిక్ మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్, నిర్మల్ ఖిల్లా, భైంసాటౌన్